



## కదిరి వైసీపీలో కొత్త పంథా

# సహకరించకుంటే.. సాధింపే...!

- ఇన్‌చార్జికి సహకరించకుంటే వేధింపులు
- ఎమ్మెల్యే వర్గీయులే టార్గెట్
- టీడీపీతో టచ్‌లో ఉన్నా అదే పరిస్థితి
- భయాందోళనల్లో బాధిత వర్గాలు

నియోజకవర్గంలో వైసీపీకి సహకరించకుంటే సొంతపార్టీవారైనా, టీడీపీ వారైనా కక్షసాధింపులు తప్పవు. పార్టీకోసం కష్టపడినా, కనికరం చూపరు. వారు చెప్పిన వాటిని పాటించాల్సిందే, చెప్పినవారికి సహకరించాల్సిందే. లేదంటే కక్ష సాధింపులు తప్పవు. టీడీపీకి టచ్‌లో ఉంటే వారి పరిస్థితి మరింత దారుణం. తమ మాట వినలేదని వైసీపీ తన వర్గీయులపైనే పరోక్షంగా కక్ష సాధింపులు మొదలు పెట్టింది. నిన్నమొన్నటి వరకు వారితో ఉండి, పార్టీకోసం అన్నివిధాలా ఖర్చుపెట్టి, నష్టపోయిన వారినీ వదలడంలేదు. పార్టీకి సహకరిస్తే సరే.. లేదంటే వారు ఎవరైనా తమకు అవసరంలేదన్నట్లు వ్యవహరిస్తున్నట్లు సమాచారం. వైసీపీలో ఎమ్మెల్యే వర్గీయులే టార్గెట్‌గా కక్షసాధింపులకు దిగుతున్నట్లు ఆ పార్టీ వర్గాలే వాపోతున్నాయి. నాలుగేళ్లకుపైగా వైసీపీలో కొనసాగినా.. తమను పట్టించుకోలేదని చాలా మంది తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో వారు టీడీపీలో చేరేందుకు సంప్రదింపులు సాగిస్తున్నారు. అలాంటి వారిని టార్గెట్ చేసుకుని కక్ష సాధింపులు మొదలయ్యాయి. వైసీపీ చర్యలతో సొంత పార్టీవర్గీయుల్లో ఆందోళన నెలకొంది.

- కదిరి


సాయిప్రణీత్ క్వారీలో తనిఖీ చేస్తున్న అధికారులు

### టీడీపీతో టచ్‌లో ఉన్నా.. అంతే..

ఎమ్మెల్యే వర్గీయులనే కాకుండా వైసీపీలో ఉండి నాలుగున్నర సంవత్సరాలుగా ఏ పదవీ ఆశించకుండా పనిచేసినవారిపై కూడా కక్ష సాధింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. వైసీపీకి వచ్చే ఎన్నికల్లో భవిష్యత్తు లేదని భావించి, తమను నిర్లక్ష్యంచేసిన ఆ పార్టీని వీడి టీడీపీలో చేరడానికి సప్రందించిన వారికి కూడా కక్ష సాధింపులు తప్పట్లేదని తెలుస్తోంది. వైసీపీకి చెందిన వాల్మీకి పవన్‌కుమార్ రెడ్డి.. టీడీపీ అధిష్ఠానంతో చర్చలు జరిపినట్లు సోషల్ మీడియల్ రెండ్రోజులుగా ప్రచారం సాగుతోంది. దీనిని సహించలేని వైసీపీ అధికానాయకత్వం ఎప్పుడూలేని విధంగా ఆయన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాల్మీకి పాఠశాలకు తనిఖీల పేరుతో విద్యాధికారులను పంపినట్లు పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి. పాఠశాల ప్రారంభం నుంచి ఏరోజూ సాధారణ తనిఖీలు తప్ప, ప్రత్యేకంగా చేసిన దాఖలాల్లేవు. నియోజవర్గ వ్యాప్తంగా గుర్తింపు ఉన్న పాఠశాలకు రాజకీయ కక్షతో తనిఖీలకు రావడం ఏమిటని వైసీపీలోని కొంత మంది ప్రశ్నిస్తున్నారు. ఇది వైసీపీలోని ఓ వర్గం వారు కావాలని చేయిస్తున్నారని చెబుతున్నారు. బెదిరించి అయినా, బలవంత పెట్టి అయినా తమవైపు పనిచేసేలా వైసీపీ అధిష్ఠానం పావులు కదుపుతోందని ఆ పార్టీ వారే చెబుతున్నట్లు సమాచారం. నారాయణ పాఠశాలను కూడా అధికారులు తనిఖీ చేశారు. మాజీ మంత్రి నారాయణకు సంబంధించిన విద్యాసంస్థలు ఎక్కడున్నా అకారణంగా తనిఖీలు చేయడం, సీజ్ వేయించడం వైసీపీ నాయకులకు అలవాటే అని టీడీపీవారు విమర్శిస్తున్నారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్నారంటూ ఈ రెండు పాఠశాలలనే టార్గెట్ చేసుకుని, తనిఖీలు చేయడం వెనుక ఆంతర్యమేమిటని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. రాజకీయ కక్ష సాధింపులో భాగమే అని వారు పేర్కొంటున్నారు.

వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా స్థానిక ఎమ్మెల్యే సిద్దారెడ్డిని కాదని మగ్బుల్‌ను అధిష్ఠానం నియమించింది. దీంతో ఎమ్మెల్యే, ఇన్‌చార్జి రెండువర్గాలుగా విడిపోయారని ఆ పార్టీ వర్గాలు బహిరంగంగానే పేర్కొంటున్నాయి. మగ్బుల్‌కు ఇన్‌చార్జి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ ఎమ్మెల్యే వర్గీయులు పెద్ద ర్యాలీతోపాటు సమావేశం నిర్వహించారు. పెద్దఎత్తున స్థానిక ప్రజాప్రతినిధులు రాజీనామా చేశారు. దీంతో రెండు గ్రూపులుగా విడిపోయారని ఎమ్మెల్యే వర్గీయులు చెబుతున్నారు. రాజీనామా చేసినవారిలో ఎక్కువ మంది ఇన్‌చార్జిగా మగ్బుల్‌కు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లో మగ్బుల్‌కు టిక్కెట్టు ఇస్తే తాము సహకరించేదే లేదని తెగేసి చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యే వర్గీయులే టార్గెట్‌గా వైసీపీ అధినాయకత్వం పావులు కదుపుతోందని సమాచారం. అందులో భాగంగానే ఎమ్మెల్యే వర్గీయుల పరిశ్రమలపై ప్రభుత్వ అధికారులు దాడులు చేస్తున్నట్లు వారు వాపోతున్నారు. అందులో భాగంగా గురువారం మున్సిపల్ మాజీ చైర్మన్ కేవీ రమేష్‌రెడ్డికి సంబంధించిన సాయిప్రణీత్ క్వారీ, శ్రీకాంత్ రెడ్డికి చెందిన ఎస్వీ కన్‌స్ట్రక్షన్స్ క్వారీపై మైనింగ్ అధికారులు దాడులు నిర్వహించినట్లు తెలిసింది. వీరిరువురు ఎమ్మెల్యే వర్గీయులే. 2019లో వైసీపీ గెలుపుకోసం కృషి చేసినవారే. ప్రస్తుతం వైసీపీలోనే కొనసాగుతున్నారు. ఎమ్మెల్యే వర్గీయులు.. ఇన్‌చార్జికి సహకరించలేదన్న అక్కసుతోనే ఈ దాడులు జరిగినట్లు సమాచారం. అధికార పార్టీలోనే కొనసాగుతున్న తమపై ఇలాంటి దాడులు ఏనాడూ చూడలేదనీ, టీడీపీ హయాంలో కూడా ఇలా చేయలేదని వాపోయారు. ఇన్‌చార్జికి సహకరించలేదన్న అనుమానంతోనే ఎమ్మెల్యే వర్గీయులపై కక్షసాధింపు చర్యలు కొనసాగుతున్నట్లు వాపోతున్నారు. కొన్ని రోజులుగా ఇది కొనసాగుతోందని తెలుస్తోంది.

**ఎమ్మెల్యే వర్గీయులే టార్గెట్**

### అభిప్రాయాలు చెప్పే స్వేచ్ఛ కూడా లేదా?

ఇన్‌చార్జికి సహరించలేదని ఎమ్మెల్యే వర్గీయులతోపాటు ఇతరులపై దాడులు చేయడం వెనుక వైసీపీ అధిష్ఠానమే ఉందన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. వైసీపీలో అభిప్రాయాలు వెల్లడించే స్వేచ్ఛ కూడా లేదా అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నియోజకవర్గంలో ఎన్నడూలేని విధంగా కక్ష సాధింపులకు పాల్పడుతున్నారనీ, ఇది వైసీపీ పతనానికి నిదర్శనమని టీడీపీ నాయకులు విమర్శిస్తున్నారు. ఈ ధోరణి విడనాడకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిస్తున్నారు.



## 16న ఖాద్రీశుడి పార్వేటోత్సవం

**కదిరి, జనవరి 11:** మకర సంక్రాంతి సందర్భంగా పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన పార్వేటోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ జెరిపిటి గోపాలక్రిష్ణ, ఈఓ శ్రీనివాసరెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. 16న ఉదయం 5 నుంచి 6 గంటల వరకు స్వామివారికి పూజలు నిర్వహిస్తామన్నారు. 8.30 గంటలకు స్వామి కదిరి కొండకు చేరుకుంటారన్నారు. 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పూజలు నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు పాలు ఆరగింప మండపానికి చేరుకుని, పాలుపొంగులు నిర్వహిస్తారన్నారు. 3 నుంచి 4 గంటల వరకు పార్వేట మండపం వద్ద పార్వేటోత్సవం, 4 నుంచి 5 గంటల వరకు శమీ మండపం వద్ద పూజలు నిర్వహిస్తారన్నారు. 5 నుంచి రాత్రి 9 గంటల వరకు స్వామివారు అశ్వవాహనంపై పట్టణ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారన్నారు. 9 నుంచి 9.30 గంటల వరకు ఆలయ ముఖద్వారం వద్ద చోర సంవాదం, హారతి తదితర కార్యక్రమాలు ఉంటాయని వారు వివరించారు.

## పట్టు రైతులు, రీలర్ల సమ్మెబాట

### 17 నుంచి నిరవధిక సమ్మె

**మడకశిర రూరల్, జనవరి 11:** పట్టు రైతులు,రీలర్లు సమ్మెబాట పడుతున్నారు. తమకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని కోరుతూ ఈనెల 17వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు రైతు సంఘం నేత సోమకుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. మల్బరీ రైతులు, రీలర్లకు ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి రూ.62 కోట్ల బకాయిలు రావాల్సి ఉందన్నారు. పలుసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. దీంతో సమ్మెలోకి వెళ్లాలని నిర్ణయించామన్నారు.

## ఖాద్రీశుడి హుండీ ఆదాయం రూ.65.74 లక్షలు

**కదిరి, జనవరి 11:** పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 41 రోజులకుగాను రూ.65.74 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జెరిపిటి గోపాలక్రిష్ణ, హుండీ పర్యవేక్షణాధికారి నరసింహరాజు, కెనరా బ్యాంకు మేనేజర్ మధుసూదన్, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఆయలంలో హుండీ సొమ్ము లెక్కిస్తున్న దృశ్యం

# అట్టహాసంగా.. సత్యసాయి విద్యార్థుల స్పోర్ట్స్ మీట్

- ఆకట్టుకున్న నృత్యాలు
- అబ్బురపరచిన విన్యాసాలు
- ఉట్టిపడిన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు
- సందర్శకులతో హిల్‌వ్యూ స్టేడియం కిటకిట


సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినుల నృత్యం


తాడుపై విన్యాసాలు


విన్యాసం అదరహో..


గురి తప్పకూడదు..: ఆర్చరీ పోటీలు


విద్యార్థినుల సంప్రదాయ నృత్యం


మండుతున్న గోళం మధ్యలోంచి బైక్ జంప్ చేస్తున్న విద్యార్థి


బైక్‌లపై విన్యాసాలు


విద్యార్థుల విన్యాసం

**పుట్టపర్తి, జనవరి 11:** సంస్కృతిని ప్రతిబింబించే నృత్యాలు, అబ్బురపరిచే విన్యాసాలతో సత్యసాయి విద్యాసంస్థల స్పోర్ట్స్ మీట్ అట్టహాసంగా సాగింది. జిల్లా కేంద్రంలోని హిల్‌వ్యూ స్టేడియంలో గురువారం శ్రీసత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ సందర్శకులను అలరించింది. విద్యార్థుల విన్యాసాలు అబ్బురపరిచాయి. ఉదయం 8 గంటలకు శ్రీసత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ పరిధిలోని ప్రశాంతి నిలయం, ఈశ్వరమ్మ కళాశాల, అనంతపురం మహిళా కళాశాల, బెంగళూరులోని బృందావన, కర్ణాటకలోని ముద్దెనహళ్లి కళాశాలల విద్యార్థులు సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చారు. భారతీయ సంస్కృతీసంప్రదాయాలు ఉట్టిపడే వస్త్రధారణతో, రంగురంగుల జెండాలు పట్టుకుని, కవాతు నిర్వహించారు. యూనివర్సిటీ జెండాను ఆవిష్కరించి, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. క్రీడాజ్యోతి వెలిగించి, స్పోర్ట్స్‌మీట్ ప్రారంభించారు. మొదట హయ్యర్ సెకండరీ విద్యార్థులు సింహనాట్యం, స్కేటింగ్, కత్తి, కర్రసాము, తాడుపై, అగ్నిగోళంలో బైక్ జంపింగ్ విన్యాసాలు సందర్శకులను అబ్బురపరిచాయి. మహాభారత యుద్ధంలో అర్జునుడికి శ్రీకృష్ణుడు హితబోధ చేస్తున్నట్లు భారీ ప్రతిమను ప్రదర్శించారు. పంజాబీ బాగ్డీ నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ముద్దనహళ్లి విద్యార్థులు రామకథ రసవాహినీ పేరుతో రామాయణంలోని లంకాదహనం, రావణ సంహారంలోని ఘట్టాలను నృత్యరూపంలో ప్రదర్శించారు. సాయంత్రం ప్రైమరీ, ఈశ్వరమ్మ అనంతపురం మహిళా కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. నెమలి నాట్యం, కరాటే విన్యాసాలు, కత్తి సాము, స్కేటింగ్, జంపింగ్, శివపురాణంలోని ఘట్టాలను చిన్నారులు ప్రదర్శించారు. క్రీడా సమ్మేళనాన్ని తిలకించడానికి వచ్చిన సందర్శకులతో స్టేడియం కిటకిటలాడింది. అనంతరం విద్యార్థులు సత్యసాయి ప్రేమతత్వంపై సామూహిక భక్తిగీతాలు ఆలపించారు. మంగళ హారతిలో క్రీడా సమ్మేళనం ముగిసింది. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, సభ్యులు చక్రవర్తి, డాక్టర్ మోహన్, నాగానందం, యునివర్సిటీ వీసీ రాఘవేంద్రప్రసాద్, సేవా సంస్థల ప్రతినిధులు కోటేశ్వరరావు, చలం, వెంకటరావు, లక్ష్మణరావు, రాజశేఖరరెడ్డి, ఆర్డీఓ భాగ్యరేఖ పాల్గొన్నారు.

పుట్టపర్తిలో 31 సంఖ్య ఆకారంలో కూర్చుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



## సమస్యలు పరిష్కరించే దాకా సమ్మె ఆపం

### అంగన్‌వాడీల ఉద్ఘాటన

**పుట్టపర్తిరూరల్, జనవరి 11:** బెదిరింపులకు బెదిరేది లేదనీ, సమస్యలు పరిష్కరించేదాకా సమ్మె విరమించేది లేదని అంగన్‌వాడీలు ఉద్ఘాటించారు. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 31వ రోజుకు చేరుకుంది. జిల్లాకేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ముందు కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి మండలాలకు చెందిన అంగన్‌వాడీలు నిరసన కొనసాగించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్‌వాడీల సమ్మెకు సంఘీభావం ప్రకటించిన సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ మాట్లాడుతూ.. సమస్యల పరిస్కారం కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం ప్రభుత్వ నీతిమాలిన చర్యగా అభివర్ణించారు. ముఖ్యమంత్రి జగన్ అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేసి, రాష్ట్ర భవిష్యత్తును అధోగతి పాలు చేశాడన్నారు. ఉద్యోగులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగి వచ్చి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

### సమగ్రశిక్ష ఉద్యోగ జేఏసీ నేత ఓబిరెడ్డి


మాట్లాడుతున్న జేఏసీ నేత ఓబిరెడ్డి

**పుట్టపర్తిరూరల్, జనవరి 11:** పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ నేత ఓబిరెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ముందు సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె 23వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఓబిరెడ్డి మాట్లాడుతూ.. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణతో సమగ్రశిక్ష కాంటాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కమిటీ నిర్వహించిన చర్చలు ఫలప్రదం అయ్యాయన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విధుల్లో చేరుతామన్నారు. సమష్టి పోరాటంతోనే సమస్యలు పరిష్కారానికి నోచుకున్నాయన్నారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు ఓబులేసు, ముకుంద, రామసుబ్బారెడ్డి, శేఖర్, రవి, ఖాదర్, నాగరాజు పాల్గొన్నారు.

## 14,295 మందికి లబ్ధి

**పుట్టపర్తి, జనవరి 11:** జిల్లావ్యాప్తంగా 14,295 మంది చిరు వ్యాపారులకు జగనన్న తోడు కింద రూ.17.86 కోట్లు నిధులు విడుదల చేశారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు అం దుకు సంబంధించిన మెగాచెక్కును విడుదల చేశారు. 17,962 మందికి వడ్డీ రాయితీ కింద రూ.39.32 లక్షల చెక్కు విడుదల చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# అనంత ముగ్గుకు అవార్డు

### ఉమాదేవికి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం



తాను వేసిన ముగ్గుతో ఉమాదేవి

**హిందూపురం, జనవరి 11:** ఉమ్మడి అనంత జిల్లా వాసి వేసిన ముగ్గుకు రాష్ట్రస్థాయి అవార్డు దక్కింది. ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో గురువారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ముత్యాల ముగ్గుల పోటీల్లో కదిరి పట్టణానికి చెందిన ఉమాదేవి ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. గతంలో కూడా ఆమె రెండుసార్లు బహుమతులు సాధించారు. ఇది మూడో బహుమతి కావడం విశేషం. తనకు బహుమతి దక్కడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. మూడుసార్లు రాష్ట్రస్థాయిలో బహుమతి అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో గతంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో సైతం మొదటి బహుమతి సాధించానన్నారు. గతేడాది విజయవాడలో నిర్వహించిన పోటీల్లో మొదటి బహుమతి సాధించానన్నారు. ఈసారి ద్వితీయ బహుమతి గెలుపొందడం కొంచెం బాధగా ఉందన్నారు. ఏబీఎన్-ఆంధ్రజ్యోతికి ఎప్పటికీ రుణపడి ఉంటానని ఆమె పేర్కొన్నారు.

## ఆంగ్లేయులను ఎదిరించిన యోధుడు వడ్డే ఓబన్న

### మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి

### కొత్తచెరువులో ఘనంగా వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ


మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె

**కొత్తచెరువు, జనవరి 11:** దేశ స్వాతంత్ర్యం కోసం 170 ఏళ్ల క్రితమే బ్రిటిష్ పాలకులను ఎదిరించిన సమర యోధుడు వడ్డే ఓబన్న అని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి కొనియాడారు. మండల కేంద్రంలోని పుట్టపర్తి రహదారిలో వడ్డెర కులస్థులు.. వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఏర్పాటుచేసి, గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరయ్యారు. ముందుగా టీడీపీ కార్యాలయం నుంచి పార్టీ పట్టణ కన్వీనర్ ఒలిపి శీనా ఆధ్వర్యంలో నాయకులు, వడ్డెర కులస్థులు, మహిళలు పెద్దఎత్తున టపాసులు కాల్చుతూ డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా ఓబన్న విగ్రహం వద్దకు చేరుకున్నారు. ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాలలు వేశారు. అనంతరం వడ్డెర కులస్థులతో కలిసి మాజీ మంత్రి పల్లె కేక్ కట్ చేసి, ఆనందం పంచుకున్నారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ.. వడ్డే ఓబన్న మహా బలశాలి అనీ, స్వాతంత్ర్యం కోసం ఆయన సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఆయ న పోరాట పటిమ అద్భుతమన్నారు. వడ్డే ఓబన్న జయంతిని మండలంలోని వడ్డెర కులస్థులు అట్టహాసంగా జరుపుకున్నారు. కార్యక్రమంలోటీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లకుంట్ల అంజినప్ప, నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, సామకోటి ఆదినారాయణ, అడపాల రామకృష్ణ, ఆలకుంట్ల శీనా, నల్లమాడ శంకర్, ఓడీసీ తీర్థ సుధాకర్, పల్లపు జయచంద్ర, తిరుపతేంద్ర, మల్లెల జయరాం, వడ్డే నారాయణ, వడ్డే పాపన్న, బండ్లపల్లి రాజు, సుధాకర్, కిష్టప్ప, కొత్తపల్లి రమణ, మనోహర్, బాబు, రఘురాం, మంజు, వెంకటరమణ, గోరంట్ల వెంకటేశ్, కుంచెపు వెంకటేశ్, ఎర్రపల్లి వెంకటరాముడు, షర్పుద్దీన్, హిదయ్‌తుల్లా, బండ్లపల్లి కేశప్ప, అంజినప్ప, శీనా పాల్గొన్నారు.

కలర్‌ఫుల్ : రంగులమయమైన నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని టెన్నిస్ కోర్టు



# హరివిల్లు.. సిరిజల్లు..

## వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం విజయవాడలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

**ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ**

**గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు**

**11 మందికి కన్సొలేషన్ బహుమతులు**

**బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి**



పరిశీలన : ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

### రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.

- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా

**ద్వితీయ బహుమతి విజేతలు**

### ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే.

- ఏ.సునీత, గుంటూరు జిల్లా

### పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

- రాధ, తమిళనాడు





**విజేతలు వీరే..**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ద్వితీయ బహుమతులు అందుకుంటున్న ఏ.సునీత (గుంటూరు), కె.ఉమాదేవి (అనంతపురం), కె.రాధ (తమిళనాడు), కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆదిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), సీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక)

# ఏమో.. ఏమౌనో..!



- వైసీపీ సిట్టింగుల్లో గుబులు
- రాయదుర్గం ఇన్‌చార్జిగా మెట్టు
- ఇప్పటికే పార్టీ వీడిన ఎమ్మెల్యే కాపు
- నాలుగు చోట్ల మార్పులు.. చేర్పులు
- ఇద్దరు సిట్టింగులకు షాక్ ఇచ్చిన వైసీపీ
- ఇక తేలాల్సింది ఎనిమిది మంది భవితవ్యమే..!



**అనంతపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):** నియోజకవర్గ ఇన్‌చార్జిల నియామకం అధికార పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో గుబులు పుట్టిస్తోంది. దశలవారీగా సిట్టింగ్ ఎమ్మెల్యేల స్థానంలో కొత్తవారిని ఇన్‌చార్జిలుగా నియమిస్తున్నారు. ఒకేసారి జాబితా బయట పెట్టకుండా.. దశలవారీగా ఇన్‌చార్జిల నియమకాలు చేపడుతుండటంతో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు కంటిమీద కునుకు కరువైంది. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ నియోజవకవర్గాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో వైసీపీ 12, టీడీపీ రెండు స్థానాల్లో గెలిచాయి. హిందూపురం, ఉరవకొండలో మాత్రమే టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్నారు. రెండు ఎంపీ స్థానాల్లోనూ వైసీపీ ఎంపీలే ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైసీపీ మార్పులకు శ్రీకారం చుట్టింది. కొత్త ఇన్‌చార్జిలే ఈ ఎన్నికల్లో అభ్యర్థులుగా ఉంటారని చెప్పకనే చెబుతోంది.

### మూడు దశల్లో నలుగురు..

వైసీపీ అధినాయకత్వం ఇప్పటి వరకూ మూడు దశల్లో నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేల స్థానంలో మార్పులు, చేర్పులు చేసింది. అనంతపురం ఎంపీ తలారి రంగయ్యను కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించింది. అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి ఉష శ్రీచరణ్‌ను పెనుకొండ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించింది. పెనుకొండ సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి శంకర్‌నారాయణను అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు. హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్‌ను పక్కన పెట్టి, అతని స్థానంలో బళ్లారి మాజీ ఎంపీ శాంతను హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు. కదిరి సిట్టింగ్ ఎమ్మెల్యే సిద్దారెడ్డిని తప్పించి, మక్బూల్ అహ్మద్‌ను ఇన్‌చార్జిగా పెట్టారు. తాజాగా రాయదుర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి స్థానంలో నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఏపీఐఐసీ ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డిని నియమించారు.

### ఎనిమిది మందిలో గుబులు

ఉమ్మడి జిల్లాలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న 12 నియోజకవర్గాల్లో ఇప్పటికే నాలుగు నియోజకవర్గాల ఇన్‌చార్జిలను ప్రకటించారు. ఆ నాలుగింటిలో కదిరి, రాయదుర్గం సిట్టింగ్‌లను పక్కన పెట్టారు. ఉష శ్రీచరణ్‌ను పెనుకొండకు, శంకరనారాయణను అనంతపురం ఎంపీ స్థానానికి బదిలీ చేశారు. ఎంపీ రంగయ్యకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశమిచ్చారు. ఇక మిగిలిన శింగనమల, గుంతకల్లు, తాడిపత్రి, అనంతపురం అర్బన్, ధర్మవరం, పుట్టపర్తి, రాప్తాడు, మడకశిర నియోజకవర్గాల విషయం తేలాల్సి ఉంది. ఇక్కడ ఇన్‌చార్జిల నియామకం ఉత్కంఠ రేపుతోంది. సిట్టింగ్‌లకే అవకాశం ఇస్తారా..? కొత్త వారిని తెచ్చిపెడతారా..? అనే చర్చ జరుగుతోంది. మిగిలిన నియోజకవర్గాల్లో ఇద్దరు, ముగ్గురు సిట్టింగ్‌లను మార్చే అవకాశం ఉందని ఆ పార్టీవారే అంటున్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ, హిందూపురం నియోజకవర్గాలకు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, దీపికా రాణి ఇన్‌చార్జిలుగా ఉన్నారు. ఈ రెండింటిలో మార్పులు, చేర్పులు ఉంటాయా..? లేదా అనే చర్చ జరుగుతోంది. నియోజకవర్గ ఇన్‌చార్జిల మార్పులు అధికార పార్టీలో పెను దుమారాన్ని రేపుతున్నాయి. ఇప్పటికే రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పార్టీకి గుడ్ బై చెప్పారు. కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారని సమాచారం. కదిరి సిట్టింగ్ ఎమ్మెల్యే సిద్దారెడ్డి తన రాజకీయ భవిష్యత్తును నిర్ణయించుకునేందుకు సమాలోచనలో ఉన్నారు. రానున్న ఎన్నికల్లో పోటీ చేయాలనే అభిప్రాయంతో ఉన్నారు. ఆయన ఏ పార్టీని ఎంచుకుంటారో వేచి చూడాల్సిందే.

# రాష్ట్రానికి జగన్ భస్మాసురుడిలా మారాడు

**చంద్రబాబు తప్ప రాష్ట్రాన్ని మరెవరూ కాపాడలేరు**

**మాజీ మంత్రి పరిటాల సునీత, యువనేత పరిటాల శ్రీరామ్**



మాట్లాడుతున్న పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

**అనంతపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రానికి భస్మాసురుడిలా మారాడని మాజీమంత్రి పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ మండిపడ్డారు. గురువారం అనంతపురంలోని వారి నివాసంలో మీడియాతో మాట్లాడుతూ జగన్ సీఎం అయిననాటి నుంచి రాష్ట్రంలో విధ్వంసకర పాలన సాగుతోందని ధ్వజమెత్తారు. వ్యవస్థలను సైతం దెబ్బతీశారన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో అడుగడుగునా అవినీతి, దౌర్జన్యాలు, అక్రమ సంపాదనలు మితిమీరాయన్నారు. ఒక్క చాన్స్ పేరుతో గాలివాటంతో అధికారం చేపట్టిన జగన్ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. పరిశ్రమలు తీసుకురాలేదన్నారు. వేలాది మంది మహిళలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వ హయాంలో రాప్తాడుకు తీసుకొచ్చిన జాకీ పరిశ్రమను స్థానిక ఎమ్మెల్యే, ఆయన సోదరుల బెదిరింపులతో పొరుగు రాష్ట్రానికి ఆ పరిశ్రమ వెళ్లిపోయిందన్నారు. ఇక ధర్మవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి భూదందాలతో ఆ ప్రాంతం వైపు చూడాలంటేనే భయపడే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇటు రాప్తాడు, అటు ధర్మవరంలో ఇసుక, గ్రానైట్, మట్టి, రియల్ ఎస్టేట్ మాఫియాలతో రూ. కోట్లు దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో ఉన్న వనరులను ఉపయోగించుకుంటూ సంపద సృష్టించడంతోపాటు పరిశ్రమల ఏర్పాటు కోసం అడుగులు వేస్తే వైసీపీ హయాంలో ఆ వనరులను దోపిడీ చేస్తూ ముందుకు సాగుతున్నారని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా భూముల రికార్డులు తారుమారు చేసి వాటిని అమ్ముకునేందుకు వైసీపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. భూహక్కు చట్టం అమలైతే అనేక ఇబ్బందులు వస్తాయని, వాటిని కూడా ఈ అవినీతి ముఖ్యమంత్రి తాకట్టు పెట్టి రుణాలు తెస్తాడని మండిపడ్డారు. ఇటువంటి పరిస్థితుల్లో చంద్రబాబు తప్ప ఈ రాష్ట్రాన్ని ఎవరూ కాపాడలేరన్నారు. వైసీపీ పాలనపై విసిగివేసారిపోయిన ప్రజలు చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని చూస్తున్నారన్నారు. అందుకు ఆయన చేపట్టిన రా కదలిరా బహిరంగ సభలకు వస్తున్న జన స్పందనే నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ప్రజలకు వైసీపీ చేస్తున్న అన్యాయాలు, అక్రమాలను ఎత్తిచూపేందుకు చంద్రబాబు రా... కదలిరా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. జగన్ ప్రభుత్వ అవినీతి, అన్యాయాలపై ప్రశ్నల వర్షం కురిపిస్తుంటే.. తాడేపల్లిలో వణుకు మొదలైందన్నారు. ఇటు జనం సైతం భారీగా తరలిరావడంతో టీడీపీలో రెట్టింపు ఉత్సాహం కనిపిస్తోందన్నారు. ఈ ఉత్సాహం చూస్తుంటే.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అన్ని సీట్లు గెలవబోతున్నామన్నది స్పష్టంగా అర్థమవుతోందన్నారు.

# కలిసి పనిచేద్దాం

**ఎన్నికల వేళ సిబ్బందికి ఎస్పీ దిశానిర్దేశం**



మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

**అనంతపురం క్రైం, జనవరి 11:** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్ని విభాగాలు కలిసి సమర్థవంతంగా పనిచేద్దామని ఎస్పీ అన్బురాజన్ పిలుపునిచ్చారు. పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని పోలీసు, సెబ్, ఎక్సైజ్, ఆర్టీఏ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, అటవీశాఖ అధికారులతో గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. రాబోవు ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా ప్రణాళికాబద్ధంగా ముందస్తు చర్యలు చేపడదామని అన్నారు. స్టాటిక్ చెక్ పోస్టులు, డైనమిక్ చెక్ పోస్టులలో సమన్వయంతో పనిచేద్దామన్నారు. బెల్టు దుకాణాలు జిల్లాలో ఉండకూడదన్నారు. అక్రమంగా నగదు, బంగారు ఆభరణాల తరలింపు జరగకూడదన్నారు. ఎన్‌డీపీఎల్, డీపీఎల్ నిబంధనల ప్రకారం సీజ్ చేయాలని సూచించారు. ఉన్నది ఉన్నట్లు సీజ్ చేసి వేగవంతంగా డిస్పోజల్ చేయాలన్నారు. కేసు నమోదు, నిందితుల అరెస్టు అంతా చట్టపరంగా ఉండాలని పేర్కొన్నారు. తరలింపుదారులతో పాటు మూలమైన కింగ్‌పిన్‌లను కూడా వదలకూడదని ఆదేశించారు. ఎఫ్‌జే వాష్, ఐడి లిక్కర్, గంజాయి సీజ్ చేయాలని, పీడీ యాక్టుకు అర్హులైన వారిని గుర్తించాలన్నారు. నగదు సీజ్, ఆ తరువాత ప్రక్రియ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అక్రమంగా ఇసుక, మట్టి ఏపీ అనుమతించొద్దన్నారు. అటవీశాఖ పరిధిలోని మెటీరియల్ కూడా అక్రమంగా రవాణా జరుగరాదన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, హనుమంతు, రీజనల్ విజిలెన్స్ ఆఫీసర్ మునిరాయమయ్య, డీఎస్పీలు ఆంథోనప్ప, శ్రీనివాసులు, గంగయ్య, నరసింగప్ప, ప్రసాద్‌రెడ్డి, మునిరాజు, ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్, పరిపాలన అధికారి శంకర్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

**అనంతపురం కల్చరల్, జనవరి 11 :** అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెను రాష్ట్ర ప్రభుత్వం అణచివేస్తోందని, దీనిని నిరసిస్తూ శుక్రవారం ఉదయం 11 గంటలకు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెపై ఎస్మా చట్టాన్ని ఉపయోగించడం దుర్మార్గమని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్‌వాడీలను చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమ్మెకు సంఘీభావంగా, ఎస్మా చట్టాన్ని నిరసిస్తూ నిర్వహిస్తున్న రౌండ్‌టేబుల్ సమావేశానికి తెలుగుదేశం, కాంగ్రెస్, సీపీఐ, సీపీఐ ఎంఎల్, న్యూడెమోక్రసీ, ఎస్‌యూసీఐ, బీఎస్పీ పార్టీలను, ప్రజాసంఘాలను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.

## సీఐల బదిలీలు

**అనంతపురం క్రైం, జనవరి 11 :** జిల్లాలో పలువురు సీఐల బదిలీలు జరిగాయి. ముగ్గురు సీఐలను వీఆర్‌కు పంపారు. ఈ మేరకు గురువారం అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా పదోన్నతి పొందిన మరో ముగ్గురు సీఐలకు అదే స్థానాలు కేటాయిస్తూ వారికి పోస్టింగ్ ఇచ్చిన తేదీ నుంచి రెగ్యులరైజ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

| సీఐ పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ స్థానం |
|---|---|---|
| జీటీ నాయుడు | సీసీఎస్,అనంతపురం | సోషల్‌మీడియా, సైబర్ క్రైమ్ సెల్, అనంతపురం |
| ఎస్.అస్రార్‌బాషా | శింగనమల సర్కిల్ | వీఆర్, ఎస్పీ, తిరుపతి |
| టి.చిన్నగోవిందు | దిశ పీఎస్,అనంతపురం | వీఆర్,ఎస్పీ, చిత్తూరు |
| బి.లక్ష్మన్న | రాయదుర్గం యూపీఎస్ | వీఆర్, ఎస్పీ, తిరుపతి |
| జి.వెంకటేశులు | బుక్కరాయసముద్రం | బీకేఎస్ పోలీస్‌స్టేషన్, (30.12.2023 నుంచి రెగ్యులరైజ్) |
| ఎన్‌వీ నాగరాజు | కళ్యాణదుర్గం రూరల్ సర్కిల్ | కళ్యాణదుర్గం రూరల్ పీఎస్ (23.11.2023 నుంచి రెగ్యులరైజ్) |
| ఎస్ జాకీర్ | ఎస్సీ, ఎస్టీ సెల్, అనంతపురం | ఎస్సీ, ఎస్టీ సెల్, అనంతపురం (29.10.2023 నుంచి రెగ్యులరైజ్) |

## ఉత్తమ సేవలు అందించిన పోలీసులకు పురస్కారాలు

**అనంతపురం క్రైం, జనవరి 11:** విధుల్లో ఉత్తమ సేవలు అందించిన పోలీసులకు ఎస్పీ అన్బురాజన్ పురస్కారాలు అందజేశారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో గురువారం సమావేశం నిర్వహించారు. గత నెలలో జరిగిన చోరీ కేసును ఛేదించి రూ.46.55లక్షల రికవరీ చేయడంతో పాటు నలుగురిని అరెస్ట్ చేయడం, 80 కేసుల్లో నిందితుడైన అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్, ఫ్యాక్షన్ గ్రామాల్లో తరచూ సందర్శించి ప్రశాంతత నిర్వహించడం తదితర విధులలో ఉత్తమ సేవలు అందించిన 74మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, ఏఆర్ ఏఎస్పీ హనుమంతు, డీఎస్పీలు ఆంథోనప్ప, శ్రీనివాసులు, గంగయ్య, నరసింగప్ప, ప్రసాద్‌రెడ్డి, మునిరాజా, ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్, పరిపాలన అధికారి శంకర్, లీగల్ అడ్వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## గెలుపే లక్ష్యంగా పని చేయాలి

● టీడీపీ శ్రేణులకు కందికుంట సూచన ● వైసీపీ నుంచి 25 కుటుంబాల చేరిక



టీడీపీలోకి చేరిన వారితో కందికుంట వెంకటప్రసాద్

**కదిరి, జనవరి 11:** వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆయన నివాసంలో గురువారం తలుపుల మండలం పులిగిండ్లపల్లి, ఉడమలకుర్తి పంచాయతీలకు చెందిన 25 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. వారికి కందికుంట కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ టీడీపీ విజయానికి సైనికుల్లా కృషి చేయాలన్నారు. కష్ట పడి పని చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. చేరిన వారిలో సోమాలవాండ్లపల్లికి చెందిన మార్కండేయ, వీర కొండయ్య, పాపయ్య, పూజ, పుల్లిగిండ్లపల్లికి చెందిన వెంకటేష్, క్రిష్ణ, జీవన్, పద్మావతమ్మ, నారాయణమ్మ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో తలుపుల మండల నాయకులు ముబారక్, మేడా శంకర్, విశ్వనాథ్‌రెడ్డి, రాజారెడ్డి, రమణ, నారాయణరెడ్డి, బాబ్‌జాన్, రాధాకృష్ణ, అంజి, రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

## ఆర్ఎల్‌డీఏ కింద ధర్మవరం రైల్వేస్థలం ఎంపిక

●రూ.9కోట్లతో అభివృద్ధికి శ్రీకారం ● టెండర్‌కు ఈ నెల 22 చివరి తేదీ

**ధర్మవరం, జనవరి 11:** రైల్వే ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఆర్ఎల్‌డీఏ) కింద ధర్మవరం రైల్వేస్థలం ఎంపికైనట్టు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా రైల్వేస్టేషన్ పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను అభివృద్ధి చేసేందుకు ఆర్ఎల్‌డీఏ కింద టెండర్లకు ఆహ్వానించింది. ఇందులో భాగంగా ఉమ్మడిజిల్లాలోని ధర్మవరం రైల్వేస్టేషన్ పరిదిలోని 14, 164.50 చదరపుఅడుగులు విస్తీర్ణంలోఉన్న భూమిని 45 సంవత్సరాల పాటు లీజుకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ భూమి యొక్క రిజర్వు ధర రూ.9.1కోట్లధరగా నిర్ణయించారు. ఈ ల్యాండ్‌కు అనువుగా 15 మీటర్ల వెడల్పుతో స్టేషన్ రోడ్డు చెన్నై-అనంతపురం రైల్వే హైవే(ఎన్‌హెచ్-716)కి సమీపంలో ఉందని, అనంతపురం, హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ పరిధిలోకి ఈ స్థలం వస్తుందన్నారు. ఈనెల 22వతేదీ 3గంటల లోపు టెండర్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## మద్దిలేరు వంకలో మృతదేహం లభ్యం

**ముదిగుబ్బ, జనవరి 11:** నెల రోజుల క్రితం కనిపించకుండా పోయిన వ్యక్తి మద్దిలేరు వంకలో శవమై తేలాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ముదిగుబ్బ మండలంలోని పట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న నాగారెడ్డిపల్లికి చెందిన పాపిరెడ్డి(60) నెలరోజుల కిందట అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఎటువంటి ఫిర్యాదు చేయలేదు. గ్రామస్థులు విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు అదృశ్యం కేసుగా నమోదు చేశారు. ట్రైనీ డీఎస్పీ పృథ్వితేజ్, ముదిగుబ్బ సీఐ యతీంద్ర దర్యాప్తు చేపట్టారు. పలువురిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ క్రమంలో మద్దిలేరు వంక సమీపంలోని జమ్ములో శవం ఉన్నట్లు గుర్తించారు. గురువారం శవాన్ని వెలికి తీసి పోలీసులు వైద్యాధికారుల సమక్షంలో సంఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ



డీఎస్పీకి అక్షింతలు అందజేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

**ధర్మవరం, జనవరి 11:** అయోధ్య రాముడి అక్షింతలను పట్టణంలోని యాదవవీధిలో గురువారం విశ్వహిందూపరిషత్ నాయకులు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అయోధ్యలో ఈనెల 22వ తేదీన రాములవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారని, ఆ రోజున ప్రతిఒక్కరూ ఇంటి ముంగిట దీపాలు వెలిగించి అక్షింతలను తలపై జల్లుకోవాలని సూచించారు. అలాగే డీఎస్పీశ్రీనివాసులు అక్షింతలు అందజేశారు. కార్యక్రమంలో జరుగుతుందని కోన కణ్వాశ్రమం స్వామీజీ, విశ్వహిందూ పరిషత్ జిల్లాఅధ్యక్షులు పులిచెర్ల వేణుగోపాల్, ఆర్ఎస్ఎస్ అఖండ కార్యనిర్వాహకుడు అన్నం అరవిందు, సభ్యులు డిష్‌రాజు, రాప్తాటిరాము, దూలెప్ప, కృష్ణ, వెంగముని, బోడగల గిరిధర్, బొల్లినేని నారాయణ, నాగరాజు, నిరంజన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు నాయకుల పరామర్శ



గడ్డమీదపల్లిలో అశోక్ కుటుంబసభ్యుల్ని పరామర్శిస్తున్న కందికుంట



ఓడీసీలో టీడీపీ నాయకుడిని పరామర్శిస్తున్న పల్లె

**నల్లచెరువు, జనవరి 11:** మండలకేంద్రంలోని గడ్డమీదపల్లిలో ఆత్మహత్యకు పాల్పడిన అశోక్ కుటుంబ సభ్యులను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ గురువారం పరామర్శించారు. అలాగే కె.పూలకుంట గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఆదెప్ప సతీమణి నిర్మలమ్మ గుండెపోటుతో మృతిచెందడంతో ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. మారిశెట్టిపల్లిలో ఆర్మీ జవాన్ అశోక్ అనారోగ్యంతో మృతిచెందగా.. అతని కుటుంబ సభ్యులను కందికుంట పరామర్శించారు. భవిష్యత్తులో బాధిత కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట మండల కన్వీనర్ రాజశేఖర్, మాజీ ఎంపీపీ మాబూసాబ్, మాజీ జడ్పీటీసీ నాగభూషణం నాయుడు, నాయకులు అశ్వర్థనాయుడు, కిరణ్‌కుమార్‌నాయుడు, కార్యకర్తలు ఉన్నారు.

**ఓబుళదేవరచెరువు:** మండలకేంద్రంలో టీడీపీ సీనియర్ నాయకుడు నిజాం అనారోగ్యంతో బాధపడుతుండడంతో గురువారం మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి వెళ్లి పరామర్శించారు. అనంతరం ఇటీవల ఆవు పొడిచి మృతిచెందిన దిగువపల్లి ఆంజనేయుల కుంటుంబాన్ని పరామర్శించి, తనవంతు ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట నాయకులు జాకీర్ అహమ్మద్, బడిశం రామాంజి, గంగాధర్, జెరిపిటి ఆంజనప్ప, జెరిపిటి ప్రసాద్, సాంబశివారెడ్డి, అంజన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

**తాడిమర్రి, జనవరి 11:** మండలంలోని సమస్యాత్మక పోలింగ్‌బూత్‌లను గురువారం ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు పరిశీలించారు. దాడితోట, పెద్దకోట్ల పోలింగ్ బూత్‌లను స్థానిక ఎస్ఐ నాగస్వామితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాట్లను స్థానిక అధికారులను అడిగితెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు పోలీసులు చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు. సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల సమాచారాన్ని తనకు పంపాలని ఎస్ఐను ఆదేశించారు.



దాడితోటలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

## రా.. కదలిరా..కు విశేష స్పందన

**పుట్టపర్తి, జనవరి 11:** టీడీపీ అధినేత చంద్రబాబు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రా కదిలిరా అనే కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా భారీ స్పందన వస్తోందని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి తెలిపారు. పట్టణంలో గురువారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఒక్క ఛాన్స్ పేరుతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి వైస్ జగన్ వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. దోచుకో -దాచుకో అనే నినాదంతో ముందుకెళ్తున్న వైసీపీ ప్రభుత్వ అవినీతిని ఎండక డుతున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయభేరి మోగించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ బంగాళాఖాతంలో కలిసిపోవడం తథ్యమని పేర్కొన్నారు.

# సమస్యలను పరిష్కరించే దాకా సమ్మె ఆగదు

● అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీదేవి

● 31వ రోజుకు చేరిన సమ్మె



ధర్మవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహారదీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు



ముదిగుబ్బలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా..



ఓడీసీలో నిరసన ..



కదిరిలో సమ్మెకు మద్దతు తెలుపుతున్న జనసేన నాయకులు

**ధర్మవరం, జనవరి 11:** ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించేంతవరకు సమ్మె ఆపేది లేదని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీదేవి అన్నారు. సమస్యల పరిష్కారం కోసం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి 31వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు నిరాహార దీక్ష చేపట్టారు. శ్రీదేవి మాట్లాడుతూ.. 31 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తుంటే.. ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. పైపెచ్చు కక్షసాధింపుచర్యలకు దిగడం శోచనీయమన్నారు. ప్రభుత్వ బెదిరింపులకు బయపడేప్రసక్తే లేదన్నారు. సమస్యలను పరిష్కరించేంతవరకు ఆందోళనను విరమించమని స్పష్టం చేశారు. ఈ సమ్మెకు సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, ఏపీ రైతుసంఘం జిల్లాఅధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ ఆదినారాయణ, అయూబ్‌ఖాన్ మద్దతు ప్రకటించారు.

**ముదిగుబ్బ:** మండలకేంద్రంలో అంగన్‌వాడీలు సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేపట్టారు. వారికి సీపీఐ నాయకులు మద్దతు పలికారు.

**కదిరిఅర్బన్:** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు సమ్మె కొనసాగించారు. సమ్మెకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భైరవప్రసాద్, నాయకులు బ్లూమూన్ శివశంకర్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. 30రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా, ప్రభుత్వం స్పందించకపోవడం బాధకరమన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని కోరారు. జనసేన నాయకులు సత్యవతి, రవికుమార్, చినప్పరెడ్డి, కిన్నెరమహేష్, హరిబాబు ఉన్నారు.

**ఓబుళదేవరచెరువు:** మండలకేంద్రంలోని సీడీపీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ ప్రాజెక్టు యూనియన్ అధ్యక్షురాలు ఆశీర్వాదమ్మ, ప్రధాన కార్యదర్శి రంగమ్మ మాట్లాడుతూ అక్కచెల్లెలమ్మ అంటూ సీఎం జగన్ తమను మోసం చేశారని మండిపడ్డారు. తమ సమస్యలు పర్కిరించాలని 31రోజులుగా సమ్మె చేస్తున్నా.. స్పందించలేదని వాపోయారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయప్ప, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

**నల్లమాడ:** మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. సమ్మె 31వరోజుకు చేరడంతో వారంతా 31 సంఖ్య ఆకృతిలో కూర్చొని నిరసన తెలిపారు.

## అర్హులు ఓటు హక్కును వినియోగించుకోవాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

**పుట్టపర్తి, జనవరి 11:** అర్హత ఉన్న ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకులానే అధికారులు చూడాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. పట్టణంలోని కలెక్టరేట్‌లో గురువారం ఆయన జిల్లాస్థాయి, అసెంబ్లీ స్థాయి మాస్టార్ ట్రైనర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. డిజిటల్ రంగంలో వస్తున్న మార్పునకు అనుగుణంగా ఎన్నికల ప్రకియలో మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. ఈవీఎంలపై ఓటర్లకు నమ్మకం కలిగేలా అవగాహన కల్పించాలన్నారు. స్వీప్ ఆధ్వర్యంలో అవగాహన విస్తృతం చేయాలన్నారు. త్వరలో లోక్‌సభతో పాటు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని, వాటి నిర్వహణకు దాదాపు 12వేల మంది సిబ్బందిని నియమించడానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. మాస్టార్ ట్రైనర్లు ఆయా నియోజకవర్గాలో పీఓలు, ఏపీఓలకు శిక్షణ ఇవ్వాలన్నారు. జిల్లాలో 1560కేంద్రాలు గుర్తించడం జరిగింది. ఆయాకేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, డీఆర్వో కొండయ్య, పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్, ఆర్డీవోలు వంశీకృష్ణ, భాగ్యరేఖ, రమేష్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వడ్డె ఓబన్న జయంతి

**ధర్మవరం/ ఓబుళదేవర చెరువు/ అమడగూరు/ నల్లమాడ జనవరి 11:** స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డె ఓబన్న 217 జయంతి వేడుకలను పట్టణంలోని గాంధీసర్కిల్‌లో శుక్రవారం వడ్డెర కులస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేశారు. తర్వాత పలువురు మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ పాలకులతో ప్రాణాలకు తెగించి పోరాటం చేసిన యోధుడు వడ్డె ఓబన్న అని కొనియాడారు. బ్రిటీష్ పాలకుల అక్రమ పన్ను వసూళ్లపై సైతం తిరుగుబాటు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వడ్డెరకులస్థులు పల్లపు రవీంద్ర, పల్లపుశివశంకర్, జంగాపల్లి పెద్దన్న, తోపుదుర్తి వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

అలాగే ఓడీసీ మండలకేంద్రంలోని వడ్డెర సంఘం కార్యాలయంలో వడ్డెర సంఘం ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు మల్లెల జయరాం వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు పల్లపు జయచంద్రమోహన్, మండలాధ్యక్షుడు ఆర్ఎంపీ కిష్టప్ప, నియోజకవర్గ అధ్యక్షుడు కొలిమిరాళ్లపల్లి సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, నాయకులు పాల్గొన్నారు. ఇక అమడగూరు మండలకేంద్రంలోని వడ్డెర సంఘం కార్యాలయంలో వడ్డెర కులస్థులు వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వడ్డెర సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మల్లెల జయరాం , ఎంపీటీసీ వెంకటరమణ, వడ్డెర సంఘం సీనియర్ నాయకులు పాల్గొన్నారు. నల్లమాడ మండలం అప్పయ్యగారిపల్లిలో వడ్డెర్లు వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



ధర్మవరంలో వడ్డెఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వడ్డెర కులస్థులు

### వడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

**పుట్టపర్తి:** స్వాతంత్ర్య పోరాటంలో వడ్డె ఓబన్న తెగువను భావితరాలు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని టీడీపీ నేతలు కొనియాడారు. వడ్డే ఓబన్న జయంతి వేడుకలు గురువారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర వడ్డెర సాధికార సమితి కన్వీనర్ వడ్డే వెంకట్ ఆధ్వర్యంలో జరిగాయి. కార్యక్రమంలో టీడీపీ ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, రామ్‌గోపాల్‌రెడ్డి, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబుతోపాటు వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వడ్డే వెంకట్ మాట్లాడుతూ స్వాతంత్ర సమర పోరాటంలో రేనాటి వీరుడైన వడ్డే ఓబన్న పోరాట పటిమతో సాధించిన విజయాలు చారిత్రాత్మకమని కొనియాడారు. టీడీపీ అధికారంలోకి రాగానే వడ్డే ఓబన్న జయంతి వేడుకలను ప్రతి ఏటా జనవరి 11న రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించేలా చూడాలని కోరారు. అనంతరం ఈ మేరకు వారందరూ టీడీపీ రాష్ట్ర నేతలకు వినతి పత్రం అందించారు. తర్వాత వడ్డే ఓబన్న క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

## కళాకారులకు సన్మానం

**ధర్మవరం రూరల్, జనవరి 11:** పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయ సమీపంలో గురువారం తేనె తెలుగుకల్చరల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 131వ కళాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో సీనియర్ రంగస్థల నటులైన అప్రాచెరువు వీరనారప్ప, వీధినాటకాల కళాకారుడు గంటాపురం జాలప్ప, సంగీత దర్శకులు ఏపీ రమణకు ప్రశంసాపత్రం, మెమెంటోలను అందజేసి శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ట్రస్టు అధ్యక్షుడు అంజినప్ప మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించడంలో భాగంగా మరుగున పడుతున్న కళలను ప్రోత్సహించడంతో పాటు కళాకారులను గుర్తించేందుకు ట్రస్టు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కళాకారులను ఘనంగా సన్మానిస్తున్నట్లు తెలిపారు. కళాకారులకు గౌరవం దక్కితే కళలను కాపాడుకోవచ్చున్నారు. కార్యక్రమంలో ట్రస్టు డైరెక్టర్ పెద్దరికం సాయి, కన్వీనర్ బీటెక్ చందు, సభ్యులు, తదితర కళాకారులు పాల్గొన్నారు.

## వడ్డెర్లకు చట్టసభల్లో అవకాశం కల్పించాలి

**అమడగూరు, జనవరి 11:** వడ్డెర్లకు చట్టసభల్లో అవకాశం కల్పించాలని వడ్డెర సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మల్లెల జయరాం పేర్కొన్నారు. మండలకేంద్రంలోని వడ్డెర సంఘం కార్యలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వడ్డెర్లంటే కేవలం రాళ్లు కొట్టుకునేవారు కాదన్నారు. ప్రధాన రాజకీయ పార్టీలు వడ్డెర్లకు చట్టసభల్లో అవకాశం కల్పించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వడ్డెర్ల అధికంగా ఉన్న నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఇవ్వాలన్నారు. అలాగే ఎమ్మెల్సీ పదవులు ఇవ్వాలని కోరారు. వడ్డెర్లు విద్యవైద్య, సామాజిక, రాజకీయాలతో పాటు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారన్నారు. కావున వడ్డెర్లను ఎస్టీల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. వడ్డెర్లను గుర్తించే ఇచ్చే పార్టీకి తాము మద్దతు ఇస్తామన్నారు. సమావేశంలో వడ్డెర సంఘం నాయకులు పల్లపు జయచంద్ర, అమరనాథ్, సుధాకర్, గడిదమప్ప, తిరుపాల్, టైలర్‌జయరాం, టైలర్ రమణ, రామచంద్ర, శ్రీరాములు, గంగరాజు, ఈశ్వరప్ప, రామప్ప తదితరులు పాల్గొన్నారు.

## కోడి పందేలు ఆడితే చర్యలు

**ఓబుళదేవరచెరువు, జనవరి 11:** సంక్రాంతి పండుగ సందర్భంగా ఎవరైనా కోడి పందేలు, పేకాట ఆడితే చర్యలు తప్పవని ఎస్ఐ కె. మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. మండలంలోని నల్లగుట్లపల్లి, వీర ఓబనపల్లి గ్రామాల్లో ఆయన గురువారం సాయంత్రం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో సమావేశమై మాట్లాడుతూ సంక్రాంతి పండుగ దృష్ట్యా ఎవరైనా కోడిపందేలు, పేకాట ఆడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. పండుగలకు ఊళ్ల వెళ్లే వారు విలువైన వస్తువులను ఇళ్లలో ఉంచకుండా వెంట తీసుకెళ్లాలని, లేదా బ్యాంక్ లాకర్లలో పెట్టుకోవాలని సూచించారు. తాళాలు వేసి ఊరికి వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## పొగ మంచు వల్ల ఎద్దులబండిని ఢీకొన్న బైక్

● భర్త మృతి, భార్యకు గాయాలు

**పెనుకొండ రూరల్, జనవరి 11:** పొలం పనులకు వెళ్తున్న ఓ రైతు గురువారం పొగమంచుతో రోడ్డు ప్రమాదానికి గురై మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని గుట్టూరు 44వ జాతీయ రహదారిపై గురువారం ఉదయం 5.30 గంటల సమ యంలో ఎద్దులబండిని ద్విచక్రవా హనం ఢీకొన్న ప్రమాదంలో భర్త చిన్నపేట నాగరాజు(60) మృతి చెందగా, భార్య కేశమ్మకు గాయాలయ్యాయి. గుట్టూరుకు చెందిన చిన్న పేట నాగరాజు, కేశమ్మ పొలం పనులకు ద్విచక్రవాహనంలో బయలు దేరారు. గుట్టూరు వైజంక్షన్ నుంచి అనంతపురం వెళ్లే రహదారిలో ఎడమ నుంచి కుడివైపు ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో వైజంక్షన్ దాటగానే గుట్టూరువైపు వెళ్తున్న ఎద్దులబండి వస్తోంది. పొగ మంచు కారణంగా ఎద్దులబండిని ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమా దంలో నాగరాజుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కేశమ్మకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆమెను పెనుకొండ ప్రభు త్వాసుపత్రికి తరలించారు. కేశమ్మను మెరుగైన వైద్యం కోసం అనంతపు రం తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థ సారథి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి పూలమాలలువేసి నివాళు లర్పించారు.

## తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం

● సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు డుమ్మా

● పంచాయతీలకు నిధుల కేటాయింపుపై అసంతృప్తి



సమావేశంలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

**కొత్తచెరువు, జనవరి 11:** మండల కేంద్రంలో గురువారం ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుడు, అధికారుల సమక్షంలో సర్వసభ్య సమావేశం జరిగింది. అయితే ఇందుకు పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు డుమ్మా కొట్టారు. ఇప్పటివరకు సర్వసభ్య సమావేశాలు దాదాపు 8 వరకు జరిగాయని, అయితే వాటిల్లో తాము అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యలు ఒకటి కూడా పరిష్కారం కాలేదని, అందుకే ఉపయోగం లేని సమావేశానికి రావడం వృథా అని పలువురు పేర్కొన్నట్లు తెలిసింది. ముఖ్యంగా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధికారపార్టీకి చెందినవారే అధికంగా ఉన్నారు. వారంతా డుమ్మా కొట్టడంతో సమావేశం వెలవెల బోయింది. పంచాయతీల అభివృద్ధికి ఒక్కరూపాయి కూడా నిధులు కేటాయించకపోతే తాము గ్రామాల్లో సమస్యలను ఏవిధంగా పరిష్కరించుకోవాలని, మూడున్నరేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో పంచాయతీల్లో కనీసం వీధిలైట్లు వేయించలేకపోతున్నామని పలువురు ప్రజాప్రతినిధులు ఆవేదన చెందినట్లు సమాచారం. సమావేశానికి వచ్చినా తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో.. తాము సమావేశాలకు హాజరు కావడం లేదని వారు అధికారులకు తెగేసిచెప్పినట్లు తెలుస్తోంది. దీంతో అధికారులు సమావేశాన్ని తూతూమంత్రంగా జరిపి ముగించారు.

## రేపు రంగవల్లుల పోటీలు

**ధర్మవరం, జనవరి 11:** జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అన్నపూర్ణేశ్వరి ఆలయం ఎదురుగా నూతనంగా నిర్మిస్తున్న జనసేన పార్టీ కార్యాలయ ఆవరణలో ఈ పోటీలు నిర్వహించనున్నామన్నారు. కావున మహిళలు ముగ్గుపిండి, రంగులు తెచ్చుకుని ఈ పోటీల్లో పాల్గొనాలన్నారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ , తృతీయ బహుమలు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

### 14న పుట్టపర్తిలో..

**పుట్టపర్తి:** తెలుగుదేశం, జనసేన పార్టీలు సంయుక్తంగా ఈనెల 14వ తేదీన ముగ్గులపోటీలు నిర్వహించనున్నట్లు జనసేన జిల్లాప్రధాన కార్యదర్శి పత్తి చంద్రశేఖర్ తెలిపారు. పట్టణంలోని సాయి ఆరామంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక దుర్గమ్మ ఆలయం వద్ద ప్రాంగణంలో ఉదయం 10గంటలకు ముగ్గులపోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల మహిళలు పాల్గొనాలన్నారు. మొదటి బహుమతిగా కుట్టుమిషన్, రెండో బహుమతిగా గ్యాస్ స్టవ్, మూడో బహుమతిగా మిక్సీ, అందజేయనున్నామన్నారు. అలాగే పాల్గొన్న మిగతావారికి ప్రోత్సాహక బహుమతులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉగ్రం శ్రీనివాసులు, పవన్, గంగాదర్, రాము తదితరులు పాల్గొన్నారు.

## రేపు పుట్టపర్తిలో కనెక్ట్ విత్ లీడర్

**పుట్టపర్తి, జనవరి11(ఆంధ్రజ్యోతి):** పుట్టపర్తి నియోజక వర్గం అభివృద్ధి, ప్రజాసమస్యలపై ఈనెల 13వతేదీన నిపుణులతో కనెక్ట్ విత్ లీడర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలుగు ప్రొఫెషనల్స్ విభాగం సభ్యులు పాండు తలపనేని, జస్వంత్‌రెడ్డి, రవి లింగుట్ల, శివరాజ్‌కుమార్, అశోక్ గురువారం తెలిపారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం సాయంత్రం 4గంటలకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందులో పుట్టపర్తి నియోజక వర్గంలో అభివృద్ధి, ప్రజాసమస్యలు, రాజకీయాల్లోకి యువత, నిపుణుల ప్రభావం లాంటి అంశాల మీద కనెక్ట్ విత్ లీడర్ చర్చా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ ముఖాముఖిలో అడిగిన ప్రశ్నలకు మాజీ మంత్రి పల్లెరఘునాథ రెడ్డి సమాధానాలు ఇస్తారన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీని అధికారంలోకి తీసుకురావడానికి చేపట్టాల్సి అంశాలపై అందరి సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, గ్రాడ్యుయేట్లు, న్యాయవాదులు, వైద్యులు, ఉపాధ్యాయులు, రాజకీయ మేధావులు హాజరుకావాలని వారు కోరారు.

## ఆస్తి కోసం సోదరి నిర్బంధం

**కదిరి, జనవరి 11:** ఆస్తి కోసం ఓ మహిళను ఆమె సోదరులు ఓ ఇంటిలో నిర్బంధించారని పట్టణ సీఐ నారాయణ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని రాయచోటి రోడ్డుకు చెందిన పటాన్ బీబీజాన్‌కు ఆమె తల్లి పులగంపల్లిలో తన పేర ఉన్న 2.30 ఎకరాల పొలంను రాసిచ్చింది. ఇది ఇష్టం లేని బీబీజాన్ సోదరులు ఆమెతో గత కొంత కాలంగా గొడవపడుతూనే ఉన్నారు. ఈక్రమంలో గురువారం పట్టణంలోని పూలబజార్‌లో ఉన్న బంధువుల ఇంటికి ఫంక్షన్‌కు బీబీజాన్ వచ్చారు. అక్కడికి వచ్చిన సోదరులు వారి బంధువులు బక్షు,చందు, ఇమ్రాన్‌ఖాన్, పర్వీన్, మున్ని, ముంతాజ్, భానులు బీబీజాన్‌ను ఆస్థి రాసివ్వాలని ఆమెతో గొడవపడి కొట్టారు. అనంతరం ఆటోలో కదిరి మండలం ముత్యాల చెరువు గ్రామానికి తీసుకెళ్లి ఇంటిలో నిర్బంధించి బెదిరించారు. అనంతరం బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

## నేడు ర్యాలీకి తరలిరండి

**ధర్మవరం, జనవరి 11:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల స్మారక విగ్రహాన్ని విజయవాడ స్వరాజ్ మైదానంలో ఈనెల 19వ తేదీన ఆవిష్కరించనున్నారని, సందర్భంగా శుక్రవారం పట్టణంలో ర్యాలీ, మానవహారం నిర్వహించనున్నామని మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ర్యాలీ ఉదయం 10గంటలకు గాంధీనగర్ సర్కిల్ నుంచి కళాజ్యోతి సర్కిల్ వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు తదితరులు హాజరు కావాలని కోరారు.

## ‘చేనేత కార్మికులకు ప్రభుత్వ పథకాలందించడమే లక్ష్యం ’

**పుట్టపర్తి రూరల్, జనవరి 11:** అర్హులైన ప్రతి ఒక్క చేనేతకార్మికుడికి ప్రభుత్వపథకాలను అందించడమే చేనేతజౌళిశాఖ లక్ష్యమని ఆ శాఖ జిల్లా అధికారి రమేష్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని దీనజనోద్ధారణ ప్రాంగణంలో గురువారం ఆయన రాష్ట్రచేనేత కార్మికుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ అర్హులైన చేనేత కార్మికులకు ప్రభుత్వ పథకాలను అందజేయడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో చేనేత అభివృద్ధి జిల్లా అధికారి వెంకటరమణ, సహాయ అభివృద్ధి అధికారి విజయానంద్, రాష్ట్ర చేనేత కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు రామ్మోహన్, జిల్లా అధ్యక్షుడు అంజనేయులు, కార్యదర్శి మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మె విరమించిన పారిశుధ్య కార్మికులు

**పెనుకొండ, జనవరి 11:** సమస్యల పరిష్కారం కోరుతూ గత 16రోజులుగా సమ్మె చేస్తున్న నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు గురువారం సమ్మె విరమించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు చిన్నవెంకటేశ్, రిక్షా నరసింహులు, తిప్పన్న, సీఐటీయూ నాయకుడు రమేష్, కార్మికులు గురువారం ఉదయం నగర పంచాయతీ కమిషనర్‌ను కలిశారు. తమ సమస్యలపట్ల ప్రభుత్వం సానుకూలంగా ప్రకటించిందని, త్వరలో జీఓ విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో తాము తాత్కాలికంగా సమ్మె వాయిదా వేస్తున్నామని తెలిపారు. యథాతథంగా విధులకు హాజరవుతామని పేర్కొన్నారు. గురువారం ఉదయం నుంచి కార్మికులు తమ విధులకు హాజరయ్యారు.

## అజ్జయ్యస్వామికి ప్రత్యేక పూజలు

**గుడిబండ, జనవరి 11 :** మండలంలో తాళికెర, ఎస్ రాయాపురం గ్రామాల సమీపంలో వెలసిన అజ్జయ్యస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య సందర్భంగా గురువారం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి ఎదుట బొరుగులు, పప్పులు నైవేద్యం ఉంచి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొన్నారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

### రైల్వే ఉద్యోగుల డిమాండ్



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న రైల్వే ఉద్యోగులు

**హిందూపురం అర్బన్, జనవరి 11:** పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని సౌత్ వెస్ట్రన్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రైల్వే ఉద్యోగులు డిమాండ్ చేశారు. స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంతంలో గురువారం ఏఐఆర్ఎఫ్ జనరల్ సెక్రెటరి శివగోపాల్ నేతృత్వంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ నెల 8 నుంచి గురువారం వరకు రిలే నిరాహార దీక్షలు చేపట్టామన్నారు. దేశవ్యాప్తంగా రైల్వే ఉద్యోగులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు దీక్షలో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూ ఆర్‌ఎంయూ హిందూపురం అధ్యక్షుడు జయప్రకాష్ జ్యోతి, ఏడీఎస్ కిరణ్‌కుమార్, కోశాధికారి సోమప్ప, అడ్వర్టయిజర్ శేఖర్, యువజన కార్యదర్శి అశోక్‌మానె, అధ్యక్షుడు నాగసునీల్, పెనుకొండ బాబా, సత్యసాయి జిల్లా యూనియన్ కార్యదర్శి నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ బోరుబావుల కేబుల్ చోరీ

**మడకశిర రూరల్, జనవరి 11 :** వ్యవసాయ బోరుబావులు, తాగునీటి పథకం బోర్లు లక్ష్యంగా పెట్టుకుని వాటికి అమర్చిన కేబుల్‌ను దొంగలు కట్‌చేసుకుని ఎత్తుకెళ్తున్నారు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని గుండుమల, మెళవాయి పంచాయతీల్లో బుధవారం రాత్రి 14 వ్యవసాయబోర్లకు అమర్చిన కేబుల్‌ను గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. ఆ బోర్ల వద్దకు వెళ్లిన తాము కేబుల్ చోరీ అయినట్లు గుర్తించామని బాధిత రైతులు తెలిపారు. నెల రోజులుగా కదిరేపల్లి మెళవాయి, గంగుళవాయిపాళ్యం, గుండుమల పంచాయతీల్లోనే ఇలాంటి దొంగతనాలు అధికంగా జరగుతున్నట్లు రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీలులు గట్టి నిఘా ఉంచి ఇలాంటి దొంగతనాలు జరుగకుండా తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## గుజిరీ లారీకి రూ.1.62 లక్షల జరిమానా

**పెనుకొండ టౌన్(సోమందేపల్లి), జనవరి 11 :** వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన గుజిరీని తరలిస్తున్న లారీకి రూ.1.62లక్షల అపరాధ రుసుము విధించినట్లు హిందూపురం డీసీటీఓ ఇంతియాజ్ గురువారం తెలిపారు. గుజిరీని సోమందేపల్లి నుంచి హిందూపురం తరలిస్తుండగా స్థానిక రాజశేఖర్‌రెడ్డి సర్కిల్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. విచారించగా సేల్స్ ట్యాక్స్ చెల్లించక లావాదేవీలు చేస్తున్నట్లు తేలిందన్నారు. దీంతో సాధారణంకన్నా అదనంగా ట్యాక్స్ విధించామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది మనోహర్ తదితరులు ఉన్నారు.

## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

**రొద్దం, జనవరి 11 :** మండలపరిధిలోని తురకలాపట్నం గ్రామంలో అనుమానాస్పద స్థితిలో రత్నమ్మ(45) అనే మహిళ మృతిచెందింది. ఎస్ఐ వలీబాష అందించిన మేరకు వివరాలిలా ఉన్నాయి. తురకలాపట్నానికి చెందిన కుమ్మర రత్నమ్మ, ఆమె బంధువులు పద్మక్క, వెంకటలక్ష్మమ్మ బుధవారం కొళాయి నీటి విషయంపై గొడవప డి ఒకరిపై ఒకరు దాడిచేసుకున్నారు. ఈ దాడిలో రత్నమ్మ అస్వస్థతకు గురైంది. స్థానిక ఆర్ఎంపీ వైద్యులతో చికిత్స అందించారు. అయితే రాత్రి 10.30గంటల సమయంలో ఆమె మృతిచెందింది. దీంతో గురువారం తెల్లవారుజామున రత్నమ్మ బంధువులు పద్మక్క, వెంకటలక్ష్మమ్మపై దాడిచేశారు. పోలీసులు విషయం తెలుసుకుని ఇరువర్గీయులను మందలించారు. మృతురాలి కుమారుడు బైలాంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

**పెనుకొండ రూరల్, జనవరి 11 :** మండలంలోని ఇస్లాపురంలో ఆస్తి పంపకాల విషయంలో మనస్తాపానికి గురై గొల్ల సతీష్(24) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఇస్లాపురానికి చెందిన గొల్ల సిద్దేష్, విజయమ్మ కుమారుడు గొల్ల సతీష్ కియ పరిశ్రమలో పనిచేస్తుండేవాడు. సతీష్‌కు సిద్దమ్మ, గంగరత్నమ్మ అనే ఇద్దరు అక్కచెల్లెళ్లు. ఇటీవల గొల్ల సిద్దేశ్ భూమిని విక్రయించాడు. అందుకోసం సంతకాలు చేయమని సతీష్ అక్కా చెల్లెలును కోరగా... వారు నిరాకరించారు. దీంతో గొల్ల సిద్దేశ్‌కు అతడి అక్కాచెల్లెలు మధ్య వివాదం నెలకొంది. ఈ క్రమంలోనే గొల్లసతీష్ తీవ్ర మనస్తాపానికి గురై బుధవారం సాయంత్రం ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు తాడి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడి తండ్రి సిద్దేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ దాదాపీర్ తెలిపారు.

## యువకుడి ఆత్మహత్యాయత్నం

**గోరంట్ల, జనవరి 11:** పట్టణంలోని పాతబస్టాండ్ వద్దగల కొత్తభవనంపైన సంతోష్ అనే యువకుడు బుధవారం రాత్రి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఓడీసీ మండలంలోని మారెవాండ్లపల్లికి చెందిన చంద్ర కుమారుడు సంతోష్ తన ద్విచక్రవాహనాన్ని మరో వ్యక్తి వద్ద రూ.20వేలకు తాకట్టు పెట్టాడు. కొద్దిరోజులు తరువాత తాకట్టుదారుడు సంతోష్‌తో మాట్లాడుతూ... త్వరగా డబ్బు ఇచ్చి వాహనం తీసుకెళ్లాలని, లేకపోతే దానిని ఎవరికైనా విక్రయిస్తానని హెచ్చరించాడు. దీంతో సంతోష్ అతడిని బెదిరించడానికి గోరంట్లకు వచ్చి క్రిమిసంహారక మందు తాగాడు. తానే స్వయంగా 100కు కాల్‌చేసి సమాచారం అందించాడు. గోరంట్ల పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని అస్వస్థతకు గురైన అతడిని గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్ వినోదకుమార్ వైద్యచికిత్సలు అందించారు.

## ఇరువర్గాల ఘర్షణ

**గోరంట్ల, జనవరి 11:** మండలకేంద్రంలోని కాంప్లెక్సు సమీపంలో సైజ్‌మీరా కుటుంబీకులు, ఇతరులు తమ మధ్య తెలెత్తిన భూవివాదంతో గురువారం ఘర్షన పడ్డారు. సైజ్‌మీరా కుటుంబీలకు 34 ఎకరాలుండగా అందులో రెండెకరాల భూమి విషయమై వివాదం నడుస్తోంది. దీని పక్క భూమిని కొన్నవారు తాము కొన్న భూమికి చుట్టూ కంచె వేయడంతో రెండెకరాలకు సంబంధించి వివాదం కొంతకాలంగా నెలకొంది. దీంతో సైజ్‌మీరా వర్గీయులు వివాదస్థలంలోని బండలు, కంచెను గురువారం తొలగించడంతో తగాద తీవ్రమైంది. ఇరువర్గాలు గోరంట్ల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐ సుబ్బరాయుడుకు పరస్పరం ఫిర్యాదు చేశారు. హక్కు పత్రాలను శుక్రవారం తీసుకుని వస్తే, పరిశీలిస్తానని సీఐ.. వారికి చెప్పి పంపారు.

# చెత్త ప్రభుత్వాన్ని సాగనంపుదాం: బీకే



ఆర్ మరువపల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న బీకే

**రొద్దం, జనవరి 11 :** రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి విమర్శించారు. ఈ చెత్త ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సన్నద్ధులు కావాలన్నారు. మండల పరిధిలోని ఆర్ మరువపల్లిలో ఆయన గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేదల నడ్డి విరిచే రద్దుల ప్రభుత్వమని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మద్యపాన నిషేధం చేస్తామని హామీ ఇచ్చిన జగన్... నాసిరకం మద్యంతో పేదలను బలితీసుకున్నాడన్నారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ తీసుకొచ్చి నిరుద్యోగాన్ని రూపు మాపుతామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక యువతను మోసం చేశాడని విమర్శించారు. అధికారంలోకి రాగానే రూ.3వేలు పింఛన్ ఇస్తామని హామీఇచ్చి మాట తప్పాడన్నారు. జగన్‌కు మళ్లీ ఓటేస్తే రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేస్తాడన్నారు. ఏదైనా రైతుల భూములపై జగన్ కన్ను పడితే బలవంతంగా లాక్కుంటున్నాడని విమర్శించారు. గ్రామాల్లో వీధి దీపాలు వేయలేని దుర్మార్గపు ప్రభుత్వమని మండిపడ్డారు. రాబో యే ప్రభుత్వం టీడీపీ, జనసేనదేనన్నారు. వైసీపీ ప్రభుత్వ అవినీతి అరాచకాలపై నిలదీస్తూ తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'రా కదిలిరా 'బహిరంగసభలకు లక్షలాది సంఖ్యలో ప్రజలు తరలివచ్చి బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. రాష్ట్రంతో పాటు మీ పిల్లల బంగారు భవిష్యత్తు బాగుండాలంటే సైకో పోవాలి, బాబు రావాల్సిందేనని ప్రజలకు పిలుపునిచ్చారు. టీడీపీ అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి ఇస్తూ ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, నాయకులు ఇమాంసాబ్, నాగరాజు, వీరన్న, నాగప్ప, రంగన్న పాల్గొన్నారు.

## ఘనంగా వడ్డె ఓబన్న జయంతి

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)



పురంలో వడ్డె ఓబన్న జయంతి వేడుకల్లో పాల్గొన్న వడ్డెర్లు

తెల్ల దొరలను గడగడలాడించి మూడు చెరువుల నీరు తాగించిన వీరుడు వడ్డె ఓబన్న అని వడ్డెర సంఘం నాయకులు, పలువురు వక్తలు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర తదితర పట్టణాలు, పలు మండల కేంద్రాల్లో వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. హిందూపురంలోని శ్రీకంఠపురం సర్కిల్‌లో వడ్డె ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. వడ్డెర్ల సంఘం నాయకులు కొల్లకుంట అంజనప్ప తదితరులు పాల్గొన్నారు. రాబోవు తరాలకు తెలిసేలా వడ్డె ఓబన్న జయంతిని ఘనంగా జరుపుకుందామని తీర్మానించారు. వారికి టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ హాజరై మద్దతు తెలిపారు. పెనుకొండలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థ సారథి ఆధ్వర్యంలో, స్థానిక అన్నక్యాంటిన్‌లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత ఆధ్వర్యంలో వడ్డె ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద వడ్డెర సంఘం నాయకులు ఓబన్న చిత్రపటానికి పూలమాలలువేసి, నివాళులర్పించారు. చిలమత్తూరులో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లకుంట అంజనప్ప తదితర నాయకుల ఆధ్వర్యంలో వడ్డె ఓబన్నకు నివాళులర్పించారు. మడకశిర పట్టణ సమీపంలోని మెట్టబండ ఆంజినేయస్వామి ఆలయం అవరణంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## కొనసాగిన అంగన్‌వాడీల నిరసన

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)



పెనుకొండలో మట్టి తింటూ అంగన్‌వాడీల వినూత్న నిరసన

సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారం 31వ రోజుకు చేరుకుంది. హిందూపురం, పెనుకొండ, మడకశిర, చిలమత్తూరు, సోమందేపల్లి, రొద్దం, గోరంట్ల, రొళ్ల, అగళి, గుడిబండ తదితర పట్టణాలు, మండల కేంద్రాల్లో తమ నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా పురంలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ... ప్రస్తుతం 5జీ రన్ అవుతున్న తరుణంలో ప్రభుత్వం 2జీ ఫోన్‌లు ఇచ్చి వాటి ద్వారా పనిచేయాలని వేధించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. అంగన్‌వాడీలు యూనిఫారాలకు, సెల్ ఫోన్‌లకు ఖర్చు చేస్తున్నామని మంత్రి ఉషశ్రీ చరణ్ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 31వ రోజు సీఎం చిత్రపటం ఉంచి నిరసన తెలిపారు. షోకాజ్ నోటీసులతో బెదిరేది లేదన్నారు. పెనుకొండలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు మట్టిని తింటూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. పెనుకొండకు వచ్చిన శిశుసంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ తమను పట్టించుకోకుండా ఇల్లిల్లు తిరుగుతూ ప్రచారం చేస్తోందన్నారు. తమ ఇళ్లకు ప్రచారానికి వస్తే ఆమె ఇచ్చిన నాసిరకం చీరలను ఆమెకే పసుపుకుంకుంగా ఇచ్చి తరిమికొడతామని హెచ్చరించారు.

## పొగ మంచు మిగిల్చిన విషాదం

### ఎద్దుల బండిని ఢీకొన్న బైక్..

### భర్త మృతి, భార్యకు గాయాలు



నాగరాజు (ఫైల్)

**పెనుకొండ రూరల్, జనవరి 11 :** పొలం పనులకు వెళ్తున్న ఓ రైతు గురువారం పొగమంచుతో రోడ్డు ప్రమాదానికి గురై మరణిం చాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని గుట్టూరు 44వ జాతీయ రహదారిపై గురువా రం ఉదయం 5.30 గంటల సమ యంలో ఎద్దులబండిని ద్విచక్రవా హనం ఢీకొన్న ప్రమాదంలో భర్త చిన్నపేట నాగరాజు(60) మృతి చెందగా, భార్య కేశమ్మకు గాయాలయ్యాయి. గుట్టూరుకు చెందిన చిన్న పేట నాగరాజు, కేశమ్మ పొలం పనులకు ద్విచక్రవాహనంలో బయలు దేరారు. పొలం పనులకు గుట్టూరు వైజంక్షన్ నుంచి అనంతపురం వెళ్లే రహదారిలో ఎడమ నుంచి కుడివైపు ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో వైజంక్షన్ దాటగానే గుట్టూరువైపు వెళ్తున్న ఎద్దులబండి వస్తోంది. పొగ మంచు కారణంగా ఎద్దులబండిని ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమా దంలో నాగరాజుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య కేశమ్మకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆమెను పెనుకొండ ప్రభు త్వాసుపత్రికి తరలించారు. కేశమ్మను మెరుగైన వైద్యం కోసం అనంతపు రం తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థ సారథి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత పెనుకొండ ప్రభుత్వా సుపత్రికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి పూలమాలలువేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంఘటన విషయాలను ఆరాతీశారు. వారి వెంట మండల ఉపాధ్యక్షుడు బోయ నాగరాజు, కన్వీనర్ సిద్దయ్య, గుట్టూరు సుబ్బరాయుడు, హుజురుల్లాఖాన్, వెంకటరాముడు, మాజీ కన్వీనర్ శ్రీరాములు, మాజీ సర్పంచ్ గుట్టూరు సూర్యనారాయణ, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద బీమాను సద్వినియోగం చేసుకోండి

**హిందూపురం అర్బన్, జనవరి 11:** పోస్టాఫీసు ద్వారా ఏర్పాటు చేసిన ప్రమాద బీమా సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ సూపరింటెండెంట్ రమాశంకర్, హెడ్‌పోస్ట్ మాస్టర్ మార్కండేయులు తెలియజేశారు. స్థానిక పోస్టాఫీసులో గురువారం రూ.10 లక్షల ప్రమాద బీమా క్లెయిమ్‌ను అందించారు. ప్రమాద బీమా ప్రీమియం కట్టి ఇటీవల జరిగిన ప్రమాదంలో హిందూపురం వాసి మృతి చెందడంతో... అతడి కుమార్తెకు ప్రమాద బీమాను అందించారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ అన్ని పోస్టాఫీసుల్లో రూ.339కే పది లక్షల ప్రమాద బీమా అందుబాటులో ఉందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాల న్నారు. హిందూపురం డివిజన్‌లో ఈ క్లెయిమ్ మొదటిదన్నారు.

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: టీడీపీ



మడకశిరలో టీడీపీ నాయకుల ప్రచారం

**మడకశిర టౌన్, జనవరి 11 :** కష్టాల్లో సైతం సమర్థవంతంగా పాల న అందించగలిగే ఏకైక నాయకుడు చంద్రబాబు అని, రాష్ట్రం అన్ని రంగా ల్లో అభివృద్ధి సాధించాలంటే ఆయనతోనే సాధ్యం అని టీడీపీ నాయకులు పాల్గొన్నారు. పట్టణ అధ్యక్షుడు మనోహర్ తదితరులు పట్టణంలోని ఏడో వార్డులో, ఎస్సీసెల్ నియోజకవర్గం అధ్యక్షుడు ఆర్ జయకుమార్ తదితరు లు అమరాపురం మండలంలోని హందుగురు, కెంకెర గ్రామాల్లో గురువారం బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీపై ప్రచార కార్యక్రమం నిర్వహించారు. మడకశిరలో తెలుగు యువత నాయకుడు తిమ్మరాజు, యూనిట్ ఇన్‌చార్జ్ రవికుమార్, నాయకులు చంద్రశేఖర్‌స్వామి, ఓం ప్రకాష్, గంగాధర్ తదితరులు పాలొన్నారు. అమరాపురం మండలంలో టీడీపీ మండల కన్వీనర్ గణేష్, సీనియర్ నాయకులు శివన్న తదితరులు, కార్యకర్తలు పాలొన్నారు.



అమరాపురం మండలంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

## జయహో బీసీ సదస్సుకు తరలిరండి

**రొద్దం, జనవరి 11:** మండంలోని ఆర్ మరువపల్లిలో శుక్రవారం ఉదయం 11గంటలకు జరిగే జయహో బీసీ సదస్సుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని టీడీపీ మండల కన్వీనర్ నరహరి గురువారం ఓ ప్రకటనలో కోరారు. రొద్దం మండల పరిధిలోని ఆర్ మరువపల్లిలోగల బీకే పార్థసారధి రైస్‌మిల్లులో జయహో బీసీ సదస్సు జరుగుతుందన్నారు. జిల్లా నుంచి బీసీ నాయకులు విచ్చేస్తారన్నారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి రావాలని కోరారు.

# మంత్రి సమావేశాలకు జనం కొరత

### చంద్రబాబును విమర్శించడంతోనే ప్రసంగం సరి

### లేపాక్షి మండలంలో ముగిసిన మంత్రి పెద్దిరెడ్డి పర్యటన



చోళసముద్రంలో మంత్రి వచ్చాక ఖాళీగా ఉన్న కుర్చీలు

**హిందూపురం, జనవరి 11 :** వైసీపీ నియోజకవర్గ బాధ్యతలను తన భుజాన వేసుకున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 4వ రోజు లేపాక్షి మండలంలో పర్యటించారు. మొదట కోడిపల్లిలో ఉదయం 9గంటలకే ప్రారంభం కావాల్సిన సమావేశం గంట ఆలస్యంగా ప్రారంభమైంది. అక్కడి నుంచి చోళసముద్రం, బిసలమానేపల్లి, నాయనపల్లి, కల్లూరు, కొండూరు పంచాయతీ కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించారు. అయితే మంత్రి సమావేశాలకు జనం అంతంత మాత్రమే వచ్చారు. కేవలం మహిళా సంఘాల సభ్యులతోనే సమావేశాలు నిర్వహిస్తున్నట్లు స్పష్టమవుతోంది. తెల్లారకనే మంత్రి పర్యటించే పంచాయతీ గ్రామాలకు వెలుగు సిబ్బంది వెళ్తున్నారు. గురువారం ఓ పంచాయతీ పరిధిలో జనం రాకపోవడంతో వెలుగు సిబ్బం దే ఈరోజు కూలీ ఇస్తామని కొంతమందిని తీసుకొచ్చినట్లు తెలిసింది. సమావేశానికి వస్తే రోజంతా వృథా అవుతోందని కూలీ పనికి వెళ్తే రూ.400 ఇస్తారని మహిళలు అనడంతో... వెలుగు సిబ్బంది వేతనం ఇచ్చి తీసుకురా వాల్సిన పరిస్థితి దాపురించిందని ఆ శాఖలోని కొంతమంది సిబ్బంది పెదవి విరిచారు. చోళసముద్రంలో జరిగిన సమావేశానికి జనం అంతంత మాత్రమే రావడంతో వెనుకాల వేసిన కుర్చీలు ఖాళీగా ఉన్నాయి. దీంతో వాటిని పక్కకు వేయాలని మంత్రి దూతలు స్థానికులకు సూచించారు.

### మధ్యాహ్నానికే వెనుదిరిగిన నవీన్‌నిశ్చల్

ఇదిలా ఉంటే ఏపీఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్‌ను మంత్రి పెద్దిరెడ్డి పిలి పించి మాట్లాడినట్లు తెలిసింది. మంత్రి భరోసా ఏమిచ్చారో తెలియదుకానీ గురువారం లేపాక్షి మండలంలో జరిగిన సమావేశాలకు నవీన్ హాజరయ్యా రు. అయితే ఉదయం కొంత ఆలస్యంగా కోడిపల్లికి వెళ్లడంతో అక్కడ వేదిక పైకి వెళ్లలేదు. పక్కనే సచివాలయం ఉండగా అక్కడే తన అనుచరులతో మాట్లాడుకుంటూ ఉండిపోయారు. ఆ తరువాత చోళసముద్రం, బిసల మానేపల్లి సమావేశాలకు హాజరయ్యారు. అనంతరం అక్కడి నుంచి హిందూపురానికి వెళ్లిపోయారు. ఆ తరువాత జరిగిన సమావేశాలకు నవీన్‌నిశ్చల్ హాజరుకాలేదు.

## వైసీపీలో సామాజిక న్యాయం ఎక్కడ?

### మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప



సమావేశంలో మాట్లాడుతున్న నిమ్మల కిష్టప్ప

**గోరంట్ల, జనవరి 11:** వైసీపీ ఐదేళ్ల పాలనలో బీసీ సామాజిక న్యాయం ఎక్కడా పాటించలేదని, నమ్ముకున్న వారికి తీరని అన్యాయం జరుగుతోందని మాజీ ఎంపీ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిమ్మల కిష్టప్ప పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఆయన నివాసంలో గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎలాంటి అవినీతి ఆరోపణలు లేని పద్మశాలి చేనేత వర్గీయుడు కర్నూల్ ఎంపీ సంజీవ్‌కుమార్‌కు టిక్కెట్ ఇవ్వకుండా మొండిచేయి చూపారన్నారు. రెడ్డి సామాజికవర్గానికి చెందిన నలుగురిని అడ్డుపెట్టుకుని జగన్ పాలన సాగిస్తూ, బీసీలకు న్యాయం చేస్తున్నట్లు కేవలం ఆర్భాటాలు చేస్తున్నారన్నారు. బీజే సంక్షేమానికి వ53 కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా, నిధులు ఇవ్వకుండా అభివృద్ధి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వంలో బీసీలు ఎంతో అభివృద్ధి చెందారన్నారు. అనంతపురం జిల్లాలో బీసీలైన కాలువ శ్రీనివసులు, బీకే పార్థసారథి, తాను ఇందుకు నిదర్శనమని అందరికీ తెలుసున్నారు. తాను ఓ మండలాధ్యక్షుడిగా గద్దె నెక్కి ఎమ్మెల్యే, మంత్రిగా, ఎంపీగా ఎదిగిన తన విషయాన్ని గుర్తు చేశారు. మాకు పార్టీలో పదోన్నతలేకానీ, ట్రాన్స్‌ఫర్లు ఉండవన్నారు. ఇప్పటికైనా జగన్ బుద్ధితెచ్చుకుని సామాజిక న్యాయం కోసం చేనేతలకు ప్రాధాన్య మివ్వాలని డిమాండ్ చేశారు. సర్వేలన్నీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నా యని, వచ్చే ఎన్నికల్లో వైసీపీ భూస్థాపితమవుతుందన్నారు. సామాజిక న్యాయం కోసమే చేనేత వర్గీయులకు అధిక శాతం టిక్కెట్లు ఇవ్వాలని కోరారు. టీడీపీలో ఎప్పటికీ సామాజిక న్యాయం ఉందన్నారు.

## బీసీల ద్రోహి జగన్: గుండుమల



విలేకరులతో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

**మడకశిర టౌన్, జనవరి 11:** ముఖ్యమంత్రి జగన్ బీసీల ద్రోహి అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి మండిపడ్డారు. బీసీలపై కక్ష గట్టి, వారుఅభివృద్ధి చెందకుండా కుట్ర పూరితంగా అణచివేస్తున్నారని అన్నారు. ఆయన గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అన్ని రంగాల్లో బీసీల అభివృద్ధికి బాటలు వేసిన ఏకైక పార్టీ టీడీపీ అన్నారు. టీడీపీకి బీసీలు అండగా ఉండటాన్ని జీర్ణించుకోలేక ముఖ్యమంత్రి వారిపై కక్ష గట్టారన్నారు. బీసీలకు మొట్టమొదటి సారిగా రిజర్వేషన్లు తీసుకొచ్చింది ఎన్టీ రామారావు అని, వాటి శాతం పెంచి పదవులను కట్టబెట్టింది చంద్రబాబు అన్నారు. కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడీ ఋణాలు అందించి బీసీల ఆర్థికాభివృద్ధికి కృషిచేశారన్నారు. జగన్ సీఎం అయిన తరువాత కార్పొరేషన్‌లకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. పైగా రిజర్వేషన్‌లు తగ్గించి రాష్ట్రంలో 16,800మంది బీసీలకు స్థానిక సంస్థల్లో పదవులు లేకుండా చేశారని విమర్శించారు. కర్నూలు ఎంపీ సంజీవ్‌రావ్ బీసీ నేత కావడంతో ఐదేళ్లలో రెండు సార్లు మాత్రమే కలవ డానికి అవకాశం ఇచ్చారన్నారు. 2024 ఎన్నికల్లో బీసీలు ఏకమై జగన్‌ను గద్దె దించాలని అప్పుడే బీసీలకు భవిష్యత్తు అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే ఆత్మరక్షణ చట్టం ద్వారా బీసీలకు అండగా ఉంటారని పేర్కొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్, మైనార్టీ జిల్లా అధ్యక్షులు భక్తర్, పట్టణ అధ్యక్షులు మనోహర్, కన్వీనర్ లక్ష్మీనారాయణ. నాయకులు రవి, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

## బీసీల గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదు: సవిత



సమావేశంలో మాట్లాడుతున్న సవిత

**పెనుకొండ టౌన్, జనవరి 11 :** బీసీల గురించి మాట్లాడే అర్హత లేని పార్టీ వైసీపీ అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత అన్నారు. ఆమె గురువారం పట్టణంలోని తన వ్యక్తిగత కార్యాలయంలో బీసీ నాయకులతో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలను గుర్తించి వారికి సముచిత స్థానం కల్పించిందన్నారు. అదే వైసీపీ బీసీ యువత భవిష్యత్తును సర్వనాశనం చేసిందన్నారు. నా బీసీ, నా ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ అంటూ సీఎం జగన్ వారికి చేసిందేమీలేదన్నారు. టీటీడీ చైర్మన్‌గా టీడీపీలో బీసీలకు అవకాశం కల్పించామని అదే వైసీపీ హయాంలో రెడ్డి సామాజికవర్గం వారినే నియమించారన్నారు. నాడు యూనివర్సిటీల్లో వైస్ చాన్స్‌లర్‌లుగా బీసీలు ఉండగా, నేడు జగన్ తన సామాజికవర్గంతో నింపేశాడన్నారు. ఏది ఏమైనా రాష్ట్రంలో జగన్‌రెడ్డి పాలన మొదలైనప్పటి నుంచి బీసీలకు తీరని అన్యాయం జరిగిందన్నారు.

## టీడీపీ వైబీ హళ్లి నాయకులకు సన్మానం



సన్మానం అనంతరం కేక్ కట్ చేస్తున్న నాయకులు

**మడకశిర రూరల్, జనవరి 11:** బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ ప్రచార కార్యక్రమంలో పార్టీ నిర్దేశించిన లక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేసిన వైబీ హళ్లి పంచాయతీలోని టీడీపీ నాయకులను గురువారం ఘనంగా సన్మానించారు. టీడీపీ మండల కన్వీనర్ లక్ష్మీనా రాయణ, సర్పంచు రామాంజనేయులు, రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీలోని యూనిట్ ఇన్‌చార్జ్‌లు ప్రసాద్ కుమార్, మూర్తి, లక్ష్మీనారాయణ, శ్రీనాథ్‌రెడ్డి, సత్యకు పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. అనంతరం కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో పంచాయతీలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.